క్లుప్తంగా

కమీషన్ బేసిక్ ఏజెంట్ కోసం దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట టౌన్: నరసరావుపేట పోస్టల్ డివిజన్ పరిధిలోని తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాల జీవిత బీమా పథకాలకు కమిషన్ బేసిక్ ఏజెంట్‌లుగా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ మహ్మద్ జాఫర్ సాదిక్ శుక్రవారం తెలిపారు. 10వ తరగతి, ఇంటర్ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 26వ తేదీ హెడ్ పోస్టాఫీసులో నిర్వహించే ఇంటర్వ్యూలకు బయోడేటాతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 9494642465 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఆదాయ వనరులు సమకూర్చడంపై శిక్షణ



బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీల ఆదాయ వనరులు సమకూర్చుకోవడం పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో పి.మాధురి శుక్రవారం తొలిరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు ఆర్థిక పరిపుష్టి కలిగి ఉండాలని, అన్ని వనరులను అంది పుచ్చుకొని కలసికట్టుగా, గ్రామాల అభివృద్ధికి ముందుకు సాగాలని అన్నారు. తొలి రోజు శిక్షణలో శ్రీనుబాబు, ఆశీర్వాదం లు రిసోర్స్ పర్సన్స్‌గా, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులకు శిక్షణలో పాల్గొన్నారు.

స్వచ్ఛతాహీ సేవపై అవగాహన ర్యాలీ



వినుకొండ: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని శివాపురంలో సర్పంచ్ కమతం సుబ్బమ్మ అధ్యక్షతన సమావేశం, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలందరూ తడిచెత్త, పొడి చెత్త గురించి తెలుసుకోవాలని, ప్లాస్టిక్ వాడొద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ ప్రభాకరరావు, అసిస్ట్ కోఆర్డినేటర్ ఏసోబు, పాఠశాల హెచ్‌ఎంలు మేడిపల్లి రక్షణ, కోటిరెడ్డి, భార్గవి, విజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

22 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



వినుకొండ: పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద గల శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ఆలయ ఆవరణలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రుల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు ప్రముఖ రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు. పది రోజుల పాటు కుంకుమ పూజలు, చండీ హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సెమీ పూజ వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు జొన్నలగడ్డ బాబ్జీ, గౌరవాధ్యక్షులు తాతా వెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల అమర్నాథ్, రెడ్డి నగేష్‌బాబు, కోశాధికారి పెండేల సురేష్, కొల్లిపర వెంకట నాగేశ్వరరావు, సదావర్తి సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ఉపాధి పనికి వెళ్లని వారికి..
కూలి డబ్బులా?

- సంచలనంగా మారిన టీడీపీ రేషన్ డీలర్ ఫేస్‌బుక్ పోస్ట్
- ములకలూరు ఉపాధి పనుల అవినీతిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా ..
- అన్ని ఆధారాలు ఉన్నాయంటూ వెల్లడి

నరసరావుపేట రూరల్: పలుగు, పార తీసుకొని కరువు పనికెళ్లి పనిచేసిన వారి కన్నా పనికెళ్లకుండా ఇంట్లో మంచమీద పడుకున్న వాళ్లకి ఎక్కువ డబ్బులు పడ్డాయి. ఇది ఎలా సాధ్యమైందంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ములకలూరుకు చెందిన రేషన్ డీలర్ ఎస్.కె.హసన్ ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్ట్ నియోజకవర్గంలో సంచలనంగా మారింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పెండింగ్ వేతనాలను ప్రభుత్వం మూడు రోజుల క్రితం విడుదల చేసింది. మే నెల నుంచి జూన్ నేల వరకు పనులకు వెళ్లిన కూలీల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి.

ఈ నేపథ్యంలో పనులకు వెళ్లని వారి ఖాతాల్లోనే అధికంగా డబ్బులు పడ్డాయని హసన్ పోస్ట్‌లో పేర్కొన్నాడు. పనులకు వెళ్లిన వారి ఖాతాల్లో రూ.800 నుంచి రూ.3 వేలు జమ అయితే అసలు పనులకే వెళ్లని వారి ఖాతాల్లో రూ.8 వేల నుంచి రూ.10వేలు పడ్డాయని తెలిపాడు. అంతా ఆన్‌లైన్ అని అవకతవకలు జరగవని అధికారులు చెబుతున్నారని ములకలూరులో జరుగుతున్న అవినీతిని గురించి ఎవరూ ప్రశ్నించరని అనుకుంటున్నారా అని పోస్ట్ చేశాడు. ములకలూరు ఉపాధి హామీ పథకంలో భారీ అవినీతి జరిగిందని, దీని గురించి అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయని, సమాచారం కోసం సంప్రదించాలని తన ఫోన్ నెంబర్‌ను ఫెస్‌బుక్ పోస్ట్‌లో పెట్టాడు.

రేషన్ డీలర్‌కు బైబై

ఉపాధి హామీ పథకంలో అవినీతి గురించి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బారావును గతంలోనే హెచ్చరించానని హసన్ సాక్షికి తెలిపాడు. రేషన్ డీలర్‌గా నువ్వు ఏం చేస్తున్నావో మాకు తెలుసు అంటూ బెదిరింపు ధోరణిలో సుబ్బారావు మాట్లాడటంతో రెండు రోజులు క్రితం రేషన్ డీలర్‌గా రాజీనామా చేసినట్టు పేర్కొన్నాడు.

ఆర్థిక స్వావలంబనే లక్ష్యం కావాలి

యడ్లపాడు ఎంపీడీవో హేమలతాదేవి



తొలిరోజు శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో

యడ్లపాడు: గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వావలంబన కల్పించే లక్ష్యమే ఓన్‌సోర్స్ రెవెన్యూ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఎంపీడీవో వి.హేమలతాదేవి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఓన్‌సోర్స్ రెవెన్యూ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. గ్రామ పంచాయతీలు తమ సొంత వనరుల ద్వారా ఆదాయాన్ని ఎలా పెంచుకోవాలన్న అంశాలపై అవగాహన కల్పించేందుకు 19, 20 తేదీలలో రెండు రోజుల పాటు ప్రజాప్రతినిధులు, గ్రామ స్థాయి అధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పన్నులు, నీటి పన్నులు సక్రమంగా వసూలు చేయడం, వాణిజ్య లైసెన్సుల ఫీజులు, వేలం పాటలు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణంతో అద్దె ఆదాయాన్ని ఎలా పెంచుకోవాలో నిపుణులు మార్గనిర్దేశం చేశారు. అలాగే పన్నులు, ఫీజుల వసూలును క్రమబద్ధీకరించడం ద్వారా గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమని ఎంపీడీవో వి.హేమలతాదేవి చెప్పారు. ఏఈ పీఆర్ బాలకుమార్, డిప్యూటీ ఎంపీడీవో జాకీర్ హుస్సేన్ పాల్గొని మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతమైతేనే, స్వయం పాలన దిశగా అడుగులు వేయగలవని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి ఈ కార్యక్రమం నూతన మార్గాలను చూపిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

అనంతరం పంచాయతీ ప్రతినిధులకు ఆదాయ పెంపుపై కీలక సూచనలు ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి అభినందన



ఝున్ను మాస్టార్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు,

యడ్లపాడు: విద్యను బోధించడమే కాకుండా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయుల్లో ఝున్ను మాస్టార్ ఒకరని హెచ్‌ఎం మాధవి చెప్పారు. మండలంలోని కొండవీడు పీఎం శ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ నందు ఎస్జీటీగా పనిచేస్తున్న షేక్ ఝున్నుసాహెబ్‌కు ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ క్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు అభినందన కార్యక్రమాన్ని ఏర్పా టు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొని ఝున్నుమాస్టార్ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి చేస్తున్న విశేష కృషిని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని సత్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఎం చైర్మన్ షేక్ రసూల్, గ్రామ పెద్దలు వీరయ్య, షేక్ సైదా, రిహానా, ఉపాధ్యాయులు సత్యనారాయణమూర్తి, బీఎస్ఎల్ రాజు, ఆంజనేయులు, సుందరమ్మ, శ్రీవమ్మ, సీహెచ్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

భూసారంపై విద్యార్థులకు అవగాహన



మట్టినమూనాల సేకరణను విద్యార్థులకు వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు స్కూల్ సాయిల్ హెల్త్‌పై విద్యార్థులకు శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో 8, 9 తరగతులు చదువుచున్న విద్యార్థులకు స్కూల్ సాయిల్ హెల్త్ పై వివరించారు. పంట పండించటానికి అవసరమైన నేల గురించి, మట్టి నమూనా సేకరణ, మట్టి పరీక్ష ఆధారంగా ఎరువులు వినియోగం పై ప్రయోగాత్మకంగా విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవినాయక్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యవసాయ శాఖ సిబ్బంది సహకారంతో 50 మట్టి నమూనాలను సేకరించారు.

మట్టి నమూనాల పరీక్షా ఫలితాలను రైతులకు వివరించారు. సాయిల్ హెల్త్‌పై విద్యార్థుల్లో అవగాహన కల్పించటమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శివలలిత, పి. యాకోబు, ఎస్. కోటయ్య, విజయదుర్గా, ఉమారాణి, పి.గౌరి, ఉపాధ్యాయులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు స్కూల్ గేమ్స్ ఉమ్మడి జిల్లా జట్లు ఎంపికలు

నరసరావుపేట ఈస్ట్: ఉమ్మడి గుంటూరుజిల్లా స్కూల్‌గేమ్స్ అండర్–14, అండర్–17 బాల బాలికల స్విమ్మింగ్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఈనెల 20వతేది శనివారం శ్రీసుబ్బారాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహిస్తున్నట్టు పల్నాడుజిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్, మహిళా కార్యదర్శి వి.పద్మావతి శుక్రవారం తెలిపారు. పోటీలో పాల్గొనే సీబీఎస్‌సీ, కెవిఎస్, ఎస్‌వీఎస్ సెంట్రల్ సిలబస్ విద్యార్థులు తప్పనిసరిగా నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకరావాలన్నారు. అలాగే స్టేట్ సిలబస్ విద్యార్థులు స్టడీ, జనన ధృవీకరణ సర్టిఫికెట్లు తీసుకరావాలని స్పష్టం చేసారు. క్రీడాకారులు తమ సర్టిఫికెట్లతో స్విమ్మింగ్ పూల్ వద్ద ఉదయం 8.30 గంటలకు కోచ్ సురేష్‌కు రిపోర్ట్ చేయాలని తెలిపారు. వివరాలకు 9703111115 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎంపీడీవోగా స్వరూపరాణికి పదోన్నతి



నాదెండ్ల: మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్న ఎస్ స్వరూపరాణికి పదోన్నతి లభించింది. రెంటచింతల ఎంపీడీవోగా పదోన్నతిపై బదిలీకానున్నారు. 2024 సెప్టెంబర్‌లో సూపరింటెండెంట్‌గా చిలకలూరిపేట నుంచి బదిలీపై నాదెండ్ల వచ్చారు.

ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్ బదిలీ కావటంతో ఇన్‌చార్జి ఎంపీడీవోగా స్వరూపరాణి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రెంటచింతల ఎంపీడీవోగా పనిచేస్తున్న చిలుకూరి శ్రీనివాసరావు నాదెండ్లకు రానున్నారు. పదోన్నతి పొందిన స్వరూపరాణికి పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పెయింటర్‌పై దాడి

నరసరావుపేట టౌన్: కంభంపాలెంకు చెందిన కంభంపాటి స్కైలాబ్ పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. ప్రకాష్‌నగర్ తిలక్ స్కూల్‌లో చదువుతున్న తన కుమారుడిని గురువారం స్కూటీపై ఎక్కించుకొని వస్తుండగా మార్గమధ్యంలో స్థానిక ఎమ్మెల్యే ఇంటి ఎదుట మేకా నాగరాజు అటకాయించి అసభ్యపదజాలంతో దూషించాడు. ఎందుకు అనవసరంగా తిరుగుతున్నావని ప్రశ్నించగా చొక్కాపట్టుకొని బలవంతంగా నెట్టడంతో గాయమైంది. పాత వివాదాన్ని దృష్టిలో ఉంచుకొని బాధితుడిపై నిందితుడు దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ చరణ్ శుక్రవారం తెలిపారు.

ముగిసిన వర్క్‌షాప్

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో టూల్ బాక్సెస్‌పై నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాపు శుక్రవారం ముగిసింది. కళాశాల ఐట్రిపుల్‌ఈ ఇండస్ట్రీయల్ సొసైటి స్టూడెంట్ బ్రాంచ్ చాప్టర్ ఆధ్వర్యంలో జరిగిన వర్క్‌షాపులో 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. అర్కెన్స్ సంస్థ ప్రొడక్ట్ మేనేజర్ పొన్నగంటి చందనా రీసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్. శ్రీనివాసరావు, ఐఈఈఈ ఐఈఎస్ స్టూడెంట్ చాప్టర్ అడ్వైజర్ డాక్టర్ వైఎస్ కిశోర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రీన్ స్కూల్ డ్రైవ్ డే

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎస్‌సి)లో శుక్రవారం స్వచ్ఛ్ పక్వాడలో భాగంగా గ్రీన్ స్కూల్ డ్రైవ్ డే నిర్వహించారు. విద్యార్థులకు స్లొగన్స్, పోస్టర్స్, పాంప్లెట్స్ తయారీ విధానం గురించి, వివిధ రకాల థీమ్స్, నీటి సంరక్షణ, ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నీటి సంరక్షణ అవశ్యకత గురించి వివరించారు. ప్రతి విద్యార్థి ప్రతి రోజు ఒక లీటరు నీటిని ఆదా చేయాలన్నారు.

సింథటిక్ రన్నింగ్‌ట్రాక్ పనుల పరిశీలన



నాదెండ్ల: అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న సింథటిక్ రన్నింగ్ ట్రాక్ పనులను విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి గురువారం ప్రారంభించారు. చిరుమామిళ్ళ శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రామిరెడ్డి అందించిన రూ.50 లక్షల ఆర్థికసాయంతో సింథటిక్ రన్నింగ్ ట్రాక్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని రన్నింగ్ ట్రాక్‌ను పరిశీలించి అదే తరహాలో ఇక్కడ నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. సింథటిక్ రన్నింగ్ ట్రాక్‌కు రూ.50 లక్షలు వ్యయం కానుండగా, మరో రూ.10 లక్షలు సివిల్ పనులకు వెచ్చించనున్నారు. ప్రస్తుతం సివిల్ వర్క్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. త్వరలో సింథటిక్ రన్నింగ్ ట్రాక్ పనులు పూర్తిచేయనున్నారు. ఆయన వెంట హెచ్‌ఎం కిషోర్, ఉపాధ్యాయులు స్థానికులు యన్నం శివారెడ్డి, తదితరులు ఉన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

నూజెండ్ల: పారిశుద్ధ్య కార్మికులు గ్రామాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత ఆరోగ్యానికి శ్రద్ధ చూపాలని ఎంపీడీవో పి.ఉమాదేవి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. శిబిరంలో మండల పరిధిలోని వైద్య సిబ్బంది,ఎఎన్ఎం, ఆశాకార్యకర్తలుతో పాటు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక వైద్యులు దీపికా మంజూషా, రాజశేఖర్, ములకలూరు ఆయుష్ వైద్యాధికారి మహదేవ్ తదితరులు హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో వృద్ధులు, మహిళలు శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

కార్యక్రమంలో డిప్యూ టీ ఎంపీడీవో సత్యనారాయణ, సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, స్వచ్ఛభారత్ మండల కోఆర్డనేటర్ కంచర్ల సుబ్బరామయ్య, లగడపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడు ఆత్మహత్య



యడ్లపాడు: అనారోగ్యంతో ఉన్న వృద్ధుడు బలవన్మణానికి పాల్పడిన ఘటన మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జగ్గాపురం గ్రామానికి చెందిన కొణతం బాబురావు అనే వృద్ధుడు కొంతకాలంగా కిడ్నీ సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యంలో గడ్డిమందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి బాబురావును చిలకలూరి పేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం గుంటూరు సమగ్ర ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు సుబ్బారావు (65) మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతిడి పెద్ద కుమార్తె సుధారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యడ్లపాడు ఎస్ఐ టి.శివరామకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఆత్మహత్యకు కారణం అనారోగ్య పరిస్థితులే కావచ్చని పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు తెలిసింది.

బాక్సింగ్ జిల్లా జట్ల ఎంపిక



బాక్సింగ్ అండర్ -17 బాలికల జట్టు



బాక్సింగ్ అండర్-14 బాలుర జట్టు

చిలకలూరిపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏఎంజీ హైస్కూల్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్–14, అండర్–17 బాక్సింగ్ జట్లు బాలురు, బాలికల విభాగంలో విడివిడిగా ఎంపిక కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ ఎంపికకు పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల నుంచి సుమారు 220 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల బరువు ప్రాతిపదికన జట్లలోకి ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఏఎంజీ హైస్కూల్ హెచ్ఎం కె.కృపాదానం, పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎన్.సురేష్ కుమార్, స్కూల్‌గేమ్స్ మహిళా సెక్రటరీ డాక్టర్ వి.పద్మావతి, పల్నాడు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పి.ఖాదర్‌మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పుడమికి పచ్చబొట్లు



వినుకొండ పరిసరాల్లో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. శావల్యాపురం మండలం–1700 ఎకరాలు ఈపూరు–4500 ఎకరాలు, బొల్లాపల్లి మండలం–3500 ఎకరాలు, నూజెండ్ల మండలం–600 ఎకరాలు, వినుకొండ రూరల్ మండలం–900 ఎకరాలు వరి నాట్లు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు వెల్లడించారు.

– శావల్యాపురం

నిర్మించి.. ఆరంభించడం మరిచారు !



నూజెండ్ల ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన వైద్యశాల భవనం పూర్తయి సంవత్సర కాలమైనా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో రోగులకు ప్రత్యేక వైద్య సదుపాయాలు అందించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం వైద్యశాల ఆవరణలో అనుబంధ భవన నిర్మాణం చేపట్టారు. ఇందు కోసం 40 లక్షల పైగా నిధులు వెచ్చించారు. భవనం పూర్తి చేయటంతో పాటు వైద్య సేవలకు అవసరమైన ఏసీలు, వైద్య పరికరాలు ఏర్పాటు చేశారు. అధికారికంగా భవనాన్ని సంబంధిత శాఖకు అప్పగించడం పూర్తయిందని ఆర్‌అండ్‌బీ ఏఈ నవ్య తెలిపారు. ఇంతా జరిగినా నూతన వైద్యశాల భవనాన్ని రోగులకు అందుబాటులో తేవడానికి వైద్యశాఖ ఎందుకు ఆలస్యం చేస్తుందని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నూతన భవనాన్ని అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

– నూజెండ్ల

మహిళల ఆరోగ్యంతోనే దేశ సౌభాగ్యం



వైద్య శిబిరం పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

చిలకలూరిపేట: మహిళల ఆరోగ్యంతోనే దేశ సౌభాగ్యం సాధ్యమౌతుందని బీజేపీ నాయకులు తెలిపారు. మండలంలోని కావూరు గ్రామంలో స్వస్త్ నారీ, స్వశక్త్ పరివార్ వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఈ వైద్య శిబిరం ద్వారా గర్భిణులకు వైద్య పరీక్షలు, వైద్యంతో పాటు పౌష్టికాహారం అందిచడమే లక్ష్యమని పేర్కొన్నారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బీఆర్ రాజేష్, డాక్టర్ ప్రత్యూష పర్యవేక్షణలో శిబిరం కొనసాగింది. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ ఉప్పాల భాస్కరరావు, కొమరవల్లిపాడు సొసైటీ అధ్యక్షుడు కోడె హనుమంతరావు, పల్నాడు జిల్లా బీజేపీ కార్యదర్శి గట్టా హేమకుమార్, బీజేవైఎం కార్యవర్గ సభ్యులు పులిగుజ్జు మహేష్, సింరేసు పోలయ్య, మాచర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.